# సాధన

రచన: రాచూరి

సాధన అనునది ఒక చక్రమువంటిది. **నీచైర్గచ్ఛత్యుపరి చ దశా చక్రనేమిక్రమేణ** అన్నట్లుగా మన సాధనలో కూడా హెచ్చు తగ్గులు సహజము. ఒక క్షణం భగవంతునిపై భక్తి హృదయములో ఉప్పొంగుతుంది, మనస్సు ద్రవిస్తుంది. భక్తితో తన్మయం చెంది భక్తుడు ఇహాన్నే మర్చిపోతాడు. వైకుంఠద్వారాన్నే ముట్టేటట్లుగా సాధనలో ఎత్తుకు ఎదిగిపోతాడు. ఐతే ఈ ఉత్కర్ష శాశ్వతం కాదు. క్షణికం. మరుక్షణం తన మనస్సు విషయాల ఊబిలో కూరుకుపోతున్నా నిస్సహాయుడై మనస్సుకు దాసోహం పలుకుతాడు. భగవంతుడ్ని విస్మరిస్తాడు. సాధనను లోలోతులకు దించేస్తాడు. ఎంతటివారికైనా ఈ తగ్గొగ్గులు తప్పవు కదా. దీనికి కారణం భగవంతుని బంధకశక్తి. ఇదే భగవంతుని మాయ. దీనిని దాటడం ఎంతటివారికైవా దుస్సాధ్యమే - దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా అంటాడు శ్రీకృష్ణుడు గీతలో.

నలభై కల్పాలపాటూ సాధన చేసి, వాయుదేవుని దగ్గర బ్రహ్మమానమున 75 వర్షాలు అధ్యయనము చేసి రుద్రపదవిని పొంది పిదప మరింత సాధన చేసి వచ్చే కల్పంలో శేషపదవిని పొందే ఆ అనంతుడికే ఈ తిరోధానం తప్పలేదంటే ఇక మన సంగతివేరే చెప్పాలా.

వాయుదేవుడు వైకుంఠవాసుడైన నారాయణుడిని దర్శించుకోవడానికి వైకుంఠానికి వెళ్లాడట. అప్పుడు శేషుడు రుక్మదండముతో(బంగారు దండముతో) అడ్డుకొని లోపలికి అనుమతిని ఇవ్వడానికి నిరాకరించగా వాయుదేవుడు - అనంతా! ఏమిటీపని? ఎవరిని అడ్డుకోవాలో ఎవరిని అడ్డుకోకూడదో తెలియక ప్రవర్తిస్తున్నావు. వెనుకటికి సనకాదులను అడ్డుకొనిన జయవిజయుల కథ నీవెరుగవా అని మందలించాడు. ఐనా శేషుడు వినక నిరాదరించాడు. నేను ఎల్లప్పుడు వైకుంఠంలోనే భగవంతుని సేవ చేస్తుంటాను. నీది ఎక్కడో సత్యలోకము. ఇప్పటికైనా ఎవరు గొప్పవారో తెలుసుకో అని గర్వంగా పలికాడు. దానికి వాయుదేవుడు చిరునవ్వుతో - ఇంట్లో తిరిగే పిల్లి కంటే బయటున్న ఏనుగే శ్రేష్ఠముకదా అని బోధించాడు.

ఇలా ఇద్దరూ మాటకు మాటగా కలహించుచుండగా ఆ శ్రీహరియే అక్కడ ప్రత్యక్షమైనాడు. శేషుడు వాయుదేవుడు చేసినది అపరాధమని, తగినవిధంగా మందలించాలని ఆ శ్రీహరికి విన్నవించుకున్నాడు. అప్పుడా శ్రీహరి "వాఙ్మాత్రేణ కిం తాత క్రియా కేవలముత్తరం" - మాటలతో జరిగేదేమున్నది. బల పరీక్ష చేసిన ఎవరు గొప్పవారో తేలిపోతుంది కదా అని చిరునవ్వుతో పలికాడు.

ఇరువురికీ స్పర్ధ ప్రారంభమైయింది. వాయుదేవుడు ఆ శేషుడున్న పర్వతాన్నే పెకిలించి విసిరివేసాడు. ఆ పర్వతం కొన్నివేల యోజనాల వరకు పోతుండగా మేరుపర్వతుడు వాయుదేవుడిని ప్రార్థించగా ఆ పర్వతాన్ని అక్కడ స్థాపిస్తాడు. అదే శేషాచలము.

మనిషి తప్పు చేస్తున్నప్పుడు విచక్షణారహితుడై తనలోని సంస్కారము వద్దంటున్నా వినకుండా ఒకక్షణం ఏమారిపోయి తప్పుచేసేస్తాడు. తరువాత ఎంతో పశ్చాత్తాపడతాడు. నేను అలా చేయకుండా ఉంటే బాగుండేది కదూ అని. ఎక్కడలేని నీచత్వాన్ని తనలో అనుభవిస్తాడు. ఇంకొక సారి ఆ తప్పును మళ్ళీ చేయకూడదనే ధృఢసంకల్పం చేస్తాడు. విశేషంగా సాధనవైపు మనస్సును మళ్ళించి తన గతం యొక్క చేదును మరిచే ప్రయత్నం చేస్తాడు. అలా చేదున్నవరకు సాగిన సాధన ఆ చేదుని మరించిన తరువాత మళ్ళీ వెనుకటి దారినే పడుదుంది. ఆహా ఎంతటిది భగవంతుడి బంధక శక్తి...

శ్రీకృష్ణార్పణమస్తు